కార్తికం.. పుణ్యప్రదం

- హరిహరులకు ప్రీతికరం ఈ మాసం
- బుధవారం నుంచి మాసోత్సవాలు ప్రారంభం
- ప్రతిధ్వనించనున్న శివనామస్మరణ

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): హరిహరులకు ఎంతో ప్రీతకరమైన కార్తిక మాసం బుధవారం నుంచి ప్రారంభం కానుంది. కార్తిక మాసంలో దీపారాధనకు విశేష ప్రాధాన్యం ఉంది. ఆలయాలు, నదీతీరాలు, ఇళ్లల్లో దీపాలు వెలిగించడం పుణ్యప్రదమని కార్తిక పురాణం చెబుతోంది. దీపదర్శనం, దీపదానం, దీపప్రకాశనం అనే మూడు ఈ మాసంలో పుణ్యాన్నిస్తాయని భక్తులు విశ్వసిస్తారు. అలాగే నదీస్నానం, దానధర్మాలు, ఉపవాసాలు, పూజలు, వ్రతాలు, నోములకు కూడా ఈ మాసంలో ప్రాధాన్యముంది. ఈ ఏడాది నాలుగు సోమవారాలు కార్తిక మాసంలో రానున్నాయి. ఈ నెల 25న నాగుల చవితి, నవంబర్ ఒకటిన శుద్ధ ఏకాదశి, ఐదున జ్వాలా తోరణం, 21న పోలి స్వర్గం, 26న సుబ్రహ్మణ్య షష్ఠి రానున్నాయి.

గోదారి తీరాన ఆలయాలు

గౌతమ మహర్షి తపోఫలితంగా, పరమ శివుని జటాజూటం నుంచి జాలు వారిన గోదావరి పరివాహక ప్రాంతం బుధవారం నుంచి శివ నామస్మరణతో మార్మోగనుంది. మార్కండేయ మహర్షి ప్రతిష్ఠించిన శివలింగాన్ని గోదావరి గట్టున ఉన్న ఉమామార్కండేయేశ్వర స్వామి ఆలయంలో చూడవచ్చు. భువనేశ్వరీ సహిత ఉమాకోటిలింగేశ్వర స్వామి ఆలయం గోదావరి తీరాన కోటిలింగాపేటలో ఉంది. అతి ప్రాచీన, పురాణ ప్రశస్తి ఉన్న ఆలయం. ప్రస్తుతం ఆలయంలో పూజలందుకుంటున్న కోటిలింగేశ్వర స్వామి లింగమని చెబుతారు. గాడాలలో మహాలక్ష్మి సమేత వేంకటేశ్వర స్వామి పీఠంలో కార్తిక మాసం సందర్భంగా రుద్రకాళీ సమేత వీరేశ్వర స్వామికి లక్షా 20 వేల రుద్రాక్షలతో అర్చన చేస్తున్నారు.



విద్యుద్దీపాలంకరణలో ఉమామార్కండేయేశ్వర స్వామి ఆలయం (ఫైల్)



కోటిలింగాల క్షేత్రం

శివకేశవులకు ప్రీతికరమైనది



మన సంప్రదాయంలో శివకేశవులకు ప్రీతికరమైన మాసం కార్తికం ఒక్కటే. ఇటు శివపరంగా కార్తిక సోమవారాలు, నాగుల చవితి వంటి పర్వదినాలు, అటు విష్ణుపరంగా ఏకాదశి, క్షీరాబ్ధి ద్వాదశి వంటి పర్వదినాలు ఈ మాసంలోనే వస్తాయి. కార్తికంలో వన సమారాధనల్లో ఉసిరి చెట్టు నీడన సాలగ్రామ పూజలు, కార్తిక దామోదర ప్రీతర్థ్యం పూజలు చేస్తారు.

– పెద్దింటి నీలకంఠశర్మ, ప్రధానార్చకుడు, ఉమామార్కండేయేశ్వర స్వామి ఆలయం

పుణ్యాన్నిచ్చే దీప దర్శనం, నదీ స్నానం



కార్తిక మాసంలో ప్రతి రోజూ పుణ్యదినమే. ప్రతి రోజూ నదీ స్నానం చేసి, దీప దర్శనం చేసుకోవడం వల్ల పాప భీతి తొలగి, ఆ హరిహరుల కృపకు పాత్రులవుతాం. అంతేకాకుండా ఈ మాసంలో పుణ్యదానాలు చేయడం శుభాన్ని కలిగిస్తుంది.

– చిన్న వెంకన్నబాబు, పీఠాధిపతి, మహాలక్ష్మి సమేత వేంకటేశ్వరస్వామి పీఠం

పుణ్య స్నానాలకు అసంపూర్తి ఏర్పాట్లు

పవిత్ర కార్తిక మాసంలో నదీ పుణ్య స్నానాలకు విశేష ప్రాశస్త్యం ఉంది. భక్తులు వేకువజామున నదీ స్నానాలు ఆచరిస్తారు. పుష్కర ఘాట్, కోటిలింగాల ఘాట్, సరస్వతీ ఘాట్, వీఐపీ ఘాట్, గౌతమ ఘాట్ తదితర వాటిలో ఏర్పాట్లు శూన్యం. మహిళలు దుస్తులు మార్చుకునే ప్రత్యేక గదుల్లో కొన్నింటికి తలుపులు కూడా లేవు. పుష్కర ఘాట్ జల్లు స్నానఘట్టం వద్ద భక్తులు స్నానమాచరించడానికి చేసిన ఏర్పాట్లు అసంపూర్తిగా ఉన్నాయి. దక్షిణ కాశీగా పేరొందిన కోటిలింగాల క్షేత్రంలో కనీసం స్నానమాచరించలేని పరిస్థితి ఘాట్‌లో నెలకొని ఉంది. ఈ ఘాట్ బురదతో నిండి, అపరిశుభ్రంగా ఉంది. బురద తొలగించి స్నానమాచరించేలా చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు. అలాగే గోదావరి గట్టున ఉన్న మార్కండేయేశ్వర స్వామి ఆలయంలో ఇప్పటి వరకు కనీస ఏర్పాట్లు చేయలేదు. ఆలయంలో విద్యుత్ కానీ, భక్తుల సందర్శనకు ఏర్పాట్లు కానరావడం లేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భక్తులకు ప్రాణాపాయం

దసరా సమయంలో గోదావరికి వరద ఉధృతి పెరగడంతో పుష్కర ఘాట్‌లో భద్రత ఏర్పాట్లు చేయడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వహించడంతో నలుగురు భక్తులు మృతిచెందిన సంఘటనలు తెలిసిందే. ఇద్దరు భవానీ భక్తులు చనిపోయినా కూడా అధికారులు కానీ, ప్రజాప్రతినిధులు కానీ భద్రత విషయంలో అప్రమత్తం కాకపోవడంతో దసరా సమయంలో మరో ఇద్దరు భక్తులు నదిలో గల్లంతయ్యారు. కార్తిక మాసంలో భక్తులంతా వేకువజామున పుణ్య స్నానమాచరించడానికి వస్తారు. అటువంటి వారికి కనీస ఏర్పాట్లు చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.


కోటిలింగాల ఘాట్ వద్ద పేరుకుపోయిన చెత్త, బురద

భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు

కమిషనర్ రాహుల్ మీనా


పుష్కర ఘాట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ రాహుల్ మీనా

రాజమహేంద్రవరం సిటీ: కార్తిక మాసం నేపథ్యంలో గోదావరి పుణ్య స్నానాలు ఆచరించేందుకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు కమిషనర్ రాహుల్ మీనా తెలిపారు. ఈ మేరకు ఆదివారం పుష్కర ఘాట్‌లో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, భక్తుల రద్దీకి తగినట్లు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసి, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. లైటింగ్, సీసీ కెమెరాలు, తాగునీరు, స్నానపు గదులు, దుస్తులు మార్చుకునే గదులు, లాకర్లను పరిశీలించారు. పబ్లిక్ అడ్రస్సింగ్ సిస్టంతో పాటు, స్విమ్మర్లను, పడవలను అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. ఘాట్ వెంబడి ఒడ్డున ఇసుక వేయించాలని, పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. కార్తిక మాస దీపోత్సవాల్లో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగరాదని స్పష్టం చేశారు. ఆయన వెంట కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ వినూత్న, ఎస్ఈ(ఇంఛార్జి) రీటా, ఈఈ మాధవి, డీఈ సత్యనారాయణ, ఏఈలు వెంకటేష్, ఆంజనేయులు ఉన్నారు.

చంద్రశేఖరస్వామికి అభిషేకాలు

రంగంపేట: మాస శివరాత్రి సందర్భంగా చంద్రేడు గ్రామంలో కొలువైన కాత్యాయనీ సమేత చంద్రశేఖర స్వామికి ఆదివారం అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఆరు గంటల నుంచి అభిషేకాలు ప్రారంభించారు. స్వామివారిని విశేషాలంకరణలు చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించినట్టు ఆలయ అర్చకుడు మైలవరపు కష్ణశర్మ తెలిపారు. భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

క్లుప్తంగా

ప్రతి ఇంటా ఓ పారిశ్రామికవేత్త రావాలి

కలెక్టర్ కీర్తి చేకూరి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కీర్తి

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): సమాజంలో ప్రతి ఇంటి నుంచి ఓ పారిశ్రామికవేత్త తయారవ్వాలనే లక్ష్యంతో ముందుకు సాగాలని కలెక్టర్ కీర్తి చేకూరి అన్నారు. ఆదివారం నగరంలోని పందిరి ఫంక్షన్ హాల్‌లో రాజమహేంద్రవరం షాపింగ్ ఉత్సవ్‌లో భాగంగా సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్ కార్యక్రమం జరిగింది. కలెక్టర్ కీర్తితో పాటు, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, జేసీ, జీఎస్టీ జిల్లా నోడల్ అధికారి వై.మేఘా స్వరూప్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి, అనంతరం ప్రదర్శన కం అమ్మకాల స్టాళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కడియం ప్రాంతంలో పూల వ్యర్థాలతో అగరవత్తుల తయారు చేస్తున్న మహిళా సంఘాలు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. వాటి ఉత్పత్తులను దేవాలయాల ద్వారా మార్కెటింగ్ చేయడానికి అవకాశం కల్పించామని వివరించారు. జ్యూట్ బ్యాగ్‌లు, చేనేత వస్త్రాలు, వంట ఉత్పత్తులు తదితర వాటిని ప్రదర్శనలో ఉంచి, విక్రయించే సదుపాయాలు కల్పించామని చెప్పారు. వాహనాలు, ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు, మందులు, మిల్క్ ప్రొడక్ట్స్ తదితర వాటికి జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు లబ్ధి కలుగుతుందన్నారు. కార్యక్రమంలో వాణిజ్య పన్నుల కమిషనర్ ఎం.సుధాకర్‌రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.భాస్కర్‌రెడ్డి, వాణిజ్య పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ టీవీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా జ్ఞానజ్యోతులు వెలిగించాలి


త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం చేస్తున్న సమితి సభ్యులు

రాజానగరం: దీపావళి రోజున ప్రతి ఇంటా జ్ఞాన జ్యోతులను వెలిగించాలని రాజమహేంద్రవరానికి చెందిన త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు అన్నారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీతతో పాటు, అనుబంధ గ్రంథాలపై మండలంలోని తూర్పు గానుగూడెం, శ్రీరామనగర్‌ల్లో ఆదివారం ప్రచారం నిర్వహించారు. గురువు తన శిష్యులకు జ్ఞానాన్ని అందించి. విశ్వమంతటా వాటి వెలుగులు ప్రసరించాలని ఆశిస్తాడన్నారు. దీపావళి రోజు ప్రతి ఇంటా దీపాలను వెలిగించడం ద్వారా ఈ యజ్ఞంలో అందరూ భాగస్వాములు కావొచ్చన్నారు. ఈ ప్రచారంలో సమితి సభ్యులు శేఖర్‌బాబు, శోభారాణి, సూర్యకుమారి, వేణు, మాధురి, సంధ్యారాణి, భరత్, లక్ష్మీనారాయణ, లోహిత, విజయ పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

కడియం: జేగురుపాడులోని హరి గార్డెన్ నర్సరీలో పేకాట శిబిరంపై కడియం పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ బి.నాగదుర్గాప్రసాద్ తన సిబ్బందితో శనివారం రాత్రి దాడి చేశారు. ఈ దాడిలో ఆరుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.13,080 నగదు, పేకముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు. కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

చీకటి వెలుగులు


ధవళేశ్వరంలో ప్రమిదలు కొంటున్న కొనుగోలుదారులు


అమ్మకానికి సిద్ధంగా ఉంచిన మట్టి ప్రమిదలు

- తగ్గిన మట్టి ప్రమిదలు, చిచ్చుబుడ్ల అమ్మకాలు
- రంగులు, విద్యుత్ లైట్లపై పెరిగిన ఆసక్తి
- ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి

ధవళేశ్వరం: దీపావళి వస్తుందంటే ఆ కుటుంబాల్లో ఆనందాల వెలుగులు వచ్చేవి. మారుతున్న జీవన శైలితో అనేక మంది విద్యుద్దీపాలపైనే మక్కువ చూపుతున్నారు. పెద్ద మాల్స్‌లో దొరుకుతున్న రంగురంగుల ప్రమిదలకు ఆకర్షితులు కావడంతో సంప్రదాయంగా వీటిని తయారు చేస్తూ.. జీవనం సాగిస్తున్న కుమ్మర్ల కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఒడుదొడుకులను ఎదుర్కొంటున్నాయి. గతంలో చిచ్చుబుడ్లు అనగానే మట్టివే గుర్తుకొచ్చేవి. ఇటీవల కాలంలో దీపావళికి ఇతర ప్రాంతాల నుంచి వివిధ కంపెనీలు తయారు చేసిన చిచ్చుబుడ్లు దిగుమతి అవుతున్నాయి. వ్యాపారులు కూడా వీటిని అమ్మేందుకు ఆసక్తి చూపుతున్నారు. మట్టి చిచ్చుబుడ్లు తయారు చేసే వారికి పెద్ద దెబ్బే తగిలింది. దీపావళిలో మట్టి ప్రమిదలకు గతంలో అధిక ప్రాధాన్యం ఇచ్చేవారు. ఇటీవల విద్యుద్దీపాలకు అధిక ప్రాధాన్యమివ్వడంతో పాటు, రంగుల ప్రమిదల కొనుగోలుకు ఆసక్తి చూపుతుండడంతో వీటి తయారీపై ఆధారపడిన అనేక కుటుంబాలు ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. కొన్నేళ్లుగా మట్టి ప్రమిదలు, చిచ్చుబుడ్ల వినియోగం తగ్గడంతో వీటిని తయారు చేసే కుటుంబాల్లో చీకట్లు అలుముకున్నాయి. వివిధ ఆకృతుల్లో ఆకర్షణీయంగా ఉండే ఇతర రాష్ట్రాల ప్రమిదలను దిగుమతి చేసుకుని ఇక్కడ విక్రయిస్తున్నారు. మట్టి ప్రమిదల తయారీ అధిక భారం అవుతుండడంతో, దిగుమతి చేసుకున్న ప్రమిదలను విక్రయిస్తూ కాలం వెళ్లదీస్తున్నారు.

అందుబాటు ధరలో..

మార్కెట్‌లో దొరికే రెడీమేడ్ ప్రమిదల కంటే మట్టి ప్రమిదలు అందుబాటు ధరలకు లభిస్తున్నాయి. ప్రమిదల సైజు బట్టి డజను ప్రమిదలు రూ.30 నుంచి రూ.40కి విక్రయిస్తున్నారు. మార్కెట్‌లో అధిక ధరల్లో లభించే ప్రమిదల కంటే తక్కువ ధరలకు లభించే మట్టి ప్రమిదల కొనుగోలు చేసి, చేతివృత్తిపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలకు చేయూతనివ్వాలని పలువురు కోరుతున్నారు.

ఉర్రూతలూగించిన ‘ఆపాత మధురాలు’



గాయకుడు రమణను సత్కరిస్తున్న ప్రముఖులు

మైమరపించిన ఘంటశాల, బాలు సంగీత విభావరి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సోగ్గాడు శోభన్‌బాబు కల్చరల్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో శోభన్‌బాబు ఫ్యాన్స్ అధ్యక్షుడు దొండపాటి సుబ్రహ్మణ్యం నిర్వహణలో ఆదివారం రాత్రి విక్రమహాల్‌లో జరిగిన పద్మశ్రీ ఘంటశాల, పద్మభూషణ్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాటల కలయికతో ఆపాత మధురాలు సినీ సంగీత విభావరి ఉర్రూతలూగించింది. జూనియర్ ఘంటశాల బిరుదాంకితుడు, కాకినాడకు చెందిన గాయకుడు పీవీ రమణ నిర్వహించిన సినీ సంగీత విభావరి వీనులవిందుగా సాగింది. ఈ సంగీత విభావరిలో పలువురు గాయనీగాయకులు పాడిన పాటలకు శ్రోతలు మైమరిచారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ గాయకునిగా పేరుగాంచిన పీవీ రమణను దొండపాటి సుబ్రహ్మణ్యం సారథ్యంలో నగర ప్రముఖులు పీవీఎస్ కృష్ణారావు, అలీ, రామచంద్రమూర్తి ఘనంగా సత్కరించారు. వక్తలు మాట్లాడుతూ భారతదేశం గర్వించదగ్గ అంతర్జాతీయ గాయకుడు పీవీ రమణ అని కొనియాడారు. తన గాన మాధుర్యంతో ఘంటశాలను జ్ఞప్తికి తెచ్చారని ప్రశంసించారు. స్వరనిధి, గాయక రత్న, గాయక సేవా శిరోమణి బిరుదులతో పాటు, అమెరికాలో సంగీత విభావరి నిర్వహించి గాయక సార్వభౌమ బిరుదు అందుకోవడం అందరికీ గర్వకారణమన్నారు. కార్యక్రమంలో ఆత్మీయ అతిథులుగా శోభన్‌బాబు ఫ్యాన్స్ సేవా సమితి గౌరవాధ్యక్షులు అల్లు బాబీ, రాయుడు చంద్రకుమార్, బర్రే సుబ్రహ్మణ్యం, మైలవరపు నాగేంద్రప్రసాద్, డీఎస్ ప్రభాకరరావు, కేశవ్ సత్యనారాయణ, టి.వెంకటరవి, కళాభిమాని కసిరెడ్డి రాంబాబు, ఆకుల రామచంద్రరావు, యేరుకొండ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


బొమ్మూరు బాలాజీపేట రోడ్డులో గోతులమయంగా రోడ్డు


కాతేరులో చెరువు సమీపంలో భారీ గొయ్యి


కాతేరు ఎన్టీఆర్ బస్టాండ్ వద్ద ఇలా..

మూన్నాళ్ల ముచ్చటేనా..!

రాజమహేంద్రవరం రూరల్: కాతేరు, బొమ్మూరు తదితర ప్రాంతాల్లో ఇటీవల ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్లపై గోతులను కంకర బూడిదతో పూడ్చించారు. ఇటీవల రెండు రోజులు కురిసిన వర్షాలకే మరలా గోతులు దర్శనమిస్తున్నాయి. దీనివలన రాత్రి సమయాల్లో వాహనచోదకులు గోతుల్లో పడి గాయాల పాలవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గోతులను శాశ్వత ప్రాతిపదికన పూడ్చించాలని స్థానికులు కోరుతున్నారు.

సినిమాలు



శ్యామల	: అరి
సూర్య మినీ	: ఓజీ
సూర్య ప్యాలెస్	: తెలుసు కదా
స్వామి	: తెలుసు కదా
అనుశ్రీ	: కె–ర్యాంప్
శివజ్యోతి	: డ్యూడ్
రాజా	: కె–ర్యాంప్
ఊర్వశి	: మిత్ర మండలి
మేనక	: ఇడ్లీ కొట్టు
రంభ	: డ్యూడ్
అప్సర	: కాంతారా చాప్టర్–1
అశోక	: డ్యూడ్
నామవరం	
వీఎస్ మహల్	: డ్యూడ్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: డ్యూడ్
కడియం	
వెంకటసూర్య	: డ్యూడ్

ఖరీఫ్ కళకళ



చంద్రేడులో కళకళలాడుతున్న మినుము పంట. (అంతర చిత్రం) రంగంపేటలో పూత మీదున్న వంగ తోట

రంగంపేట: మండలంలో సాగు చేసిన ఖరీఫ్ పంటలు కళకళలాడుతున్నాయి. వడిశలేరు, రంగంపేట, చంద్రేడు, పెదరాయవరం, కోటపాడు, మర్రిపూడి, సింగంపల్లి, నల్లమిల్లి, దొడ్డిగుంట, వెంకటాపురం, సుభద్రంపేట, ముకుందవరం, జిదొంతమూరు, వీరంపాలెం, ఈలకొలను, ఎస్టీ రాజాపురం తదితర గ్రామాల్లో రైతులు సాగు చేసిన వరి, మొక్కజొన్న, మినుము, పెసర, మిరప పంటలతో పాటు, వంగ, బెండ, ఆనప, బీర, చిక్కుడు తదితర కూరగాయ పంటలు వాతావరణం అనుకూలించడంతో కళకళలాడుతున్నాయి. బోర్ల కింద ముందుగా సాగు చేసిన వరి పంట కోతలు ప్రారంభమయ్యాయి. మిగతా చోట్ల పొట్ట, ఈనిక దశలో ఉంది. వరి ఈ ఏడాది ఎకరానికి 30 నుంచి 35 బస్తాల దిగుబడి ఉంటుందని రైతులు అంటున్నారు. మొక్కజొన్న తోటలు కూడా ఏపుగా ఎదిగి, కండ కట్టే దశలో ఉన్నాయి. మినుము, పెసర చేలు పూత, పిందెలతో కళకళలాడుతున్నాయి. పచ్చిమిర్చి కోతలు కోస్తున్నారు. వాతావరణం అనుకూలించడం, చీడపీడల బెడద తగ్గడంతో కొంత మేర ఖర్చులు తగ్గాయని రైతులు చెబుతున్నారు.